జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
గురువారం 26 02 2026
సంపుటి 1 సంచిక 96
పేజీలు : 04
PRGI No : TGTEL/25/A4195

దశ పత్రికలో పనిచేసేందుకు జీహెచ్ఎంసీ పరిధిలో రిపోర్టర్లు కావలెను. సీనియర్ రిపోర్టర్లకు తగిన పారితోషికం ఇవ్వబడును.
7337 54 6647
9848 28 8850

## ముత్యాల తలంబ్రాలు.. మురిసిన భక్తజనం

యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రాల నడుమ సింహ లగ్నంలో మాంగళ్యధారణ ఘట్టం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది.





# ఫొటో కొట్టండి.. గిఫ్ట్ పట్టండి

**తాగు నీరు వేస్ట్ చేసే వారి పట్ల జీహెచ్ఎంసీ అధికారులు కొరఢా**

**నీటిని వృథా చేసే వారి ఫోటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే రూ.200 బహుమతి**

**నీటిని వృథా చేసిన వారికి.. రూ.1000 నుంచి రూ.5000 వరకూ ఫైన్**

**దశ, హైదరాబాద్:**

హైదరాబాద్‌లో ఎవరైనా తాగునీటిని వృథా చేస్తున్నారా. అయితే అది మీ కంట పడిందా.. మీకు ఒక గుడ్‌న్యూస్. ఎందుకంటే తాగు నీరు వేస్ట్ చేసే వారి పట్ల జీహెచ్ఎంసీ అధికారులు కొరఢా ఝుళిపించనున్నారు. నీటిని వృథా చేసే వారికి సంబంధించిన ఫోటోలను క్లిక్ మనిపించి.. ఆ ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే.. వారికి రూ.200 బహుమతి ఇవ్వనున్నారు. వచ్చేది వేసవి కావడంతో నీటి కొరత లేకుండా ఉండేందుకు అధికారులు ముందు జాగ్రత్తలు చేపడుతున్నారు.ఎండాకాలం వచ్చిందంటే చాలు హైదరాబాద్ మహా నగరంలో తాగు నీటి కొరత ఏర్పడుతుంది. ఇళ్లల్లో ఉండే బోర్లు ఎండిపోయి.. తాగడానికి, కడుక్కోడానికి కూడా నీరు లేక నగరవాసులు అవస్థలు పడుతున్న సంఘటనలు గత కొన్నేళ్లుగా చూస్తూనే ఉన్నాం. ఇక వేసవిలో వాటర్






ట్యాంకర్లకు భారీ డిమాండ్ ఏర్పడుతుంది. దీంతో భారీగా డబ్బులు ఖర్చు పెట్టినా వాటర్ ట్యాంకర్ దొరుకుతుందనే నమ్మకం కూడా ఉండదు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం వేసవి కాలం ప్రవేశించడంతో హైదరాబాద్ నగరంలో నీటి కటకట రాకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఎవరైనా తాగునీటిని వేస్ట్ చేస్తుంటే.. ఒక్క ఫోటో తీసి పంపిస్తే.. అలా ఫోటో పంపించిన వారికి రూ.200 గిఫ్ట్‌గా అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందుకోసం పానీ యాప్‌ను వచ్చే నెల తొలి వారంలో అందుబాటులోకి

..మిగతా 2వ పేజీలో →

## సీఎం రేవంత్ తో అడోబ్ సీఈవో భేటి



**దశ, హైదరాబాద్:** గ్లోబల్ మాన్యు ఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, యువతకు స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ వంటి అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడోబ్ సీఈఓ, తెలంగాణ రైజింగ్ 2047 విజన్ బోర్డు సభ్యులు శంతను నారాయణ్ తో చర్చించారు. హైదరాబాద్ లో శంతను నారాయణ్ ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులు, అవకాశాలపై ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన చర్యల గురించి ముఖ్యమంత్రితో చర్చించారు. మాన్యుఫాక్చరింగ్ రంగంలో తెలంగాణను శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు, ప్రముఖ సంస్థలను ఆకర్షించడానికి సరైన ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరం ఉందని సమావేశంలో ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఏఐలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఆర్థిక వ్యవస్థపై చూపించే ప్రభావం, రాబోయే రోజుల్లో ఏఐను సమర్ధవంతంగా వినియోగించుకోవడానికి తీసుకోవలసిన చర్యలపై శంతను నారాయణ్ తో ముఖ్యమంత్రి చర్చించారు. సాంకేతిక రంగంతో పాటు తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు మరింత సహకరించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు.

## యుట్యూబర్ ఆత్మహత్య



**దశ, హైదరాబాద్:** రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో యుట్యూబర్ కోమలి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు మూడు సంవత్సరాలుగా మరో యుట్యూబర్ తో ప్రేమలో ఉన్నట్లు సమాచారం. మనస్థాపంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కోమలి మణికొండ చిత్రపురి కాలనీలో తన మామ ఇంట్లో ఉంటుంది. సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తూ యూట్యూబర్ గా రాణిస్తున్న అఖిల్ రెడ్డితో కోమలికి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరు మధ్య ఏర్పడ్డ విభేదాల కారణంగా ఇద్దరు విడిపోయారు.

## యూట్యూబర్ అన్వేష్‌పై లుక్‌అవుట్ నోటీసులు



**దశ, హైదరాబాద్:** ప్రపంచ యాత్రికుడిగా పేరు తెచ్చుకున్న యూట్యూబర్ అన్వేష్ (నా అన్వేషణ)కు మరో బిగ్‌షాక్ తగిలింది. పంజాగుట్ట పోలీసులు అతనిపై లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల అన్వేష్ అకౌంట్‌ను ఇన్‌స్టాగ్రామ్ బ్లాక్ చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత అతడు తనకు ఇంకా రెండు ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు, రెండు యూట్యూబ్ ఛానళ్లు ఉన్నాయని వీడియో విడుదల చేశారు. అసభ్యకరమైన పదజాలాన్ని వాడుతూ వీడియోను విడుదల చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో పంజాగుట్ట పోలీసులు... అన్వేష్‌కు సంబంధించిన మరో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌తో పాటు యూట్యూబ్ ఛానళ్లను మూసివేయాలని సంబంధిత సంస్థలకు లేఖలు రాయనున్నారు. ఇప్పటికే హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అన్వేష్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే.

## తెలంగాణలో లిక్కర్ తయారీ కేంద్రం పేరుతో ఘరానా మోసం

**దశ, హైదరాబాద్:**

బేవరేజస్ గోదాం, పబ్బులు, లిక్కర్ లైసెన్సులు ఇప్పిస్తామంటూ కోట్లు వసూళ్లు చేసిన అక్కల రామకృష్ణ ప్రసాద్ ను సిసిఎస్ పోలీసులు అరెస్టు చేసారు. ఆస్ట్రేలియా సిటిజన్ అంటూ హైదరాబాద్లో పలువురి వ్యాపారులతో పరిచయం ఏర్పాటు చేసుకొని బురిడీ కొట్టించాడు. వ్యాపారి నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు, నిందితుడిని అరెస్టు చేసారు. ఎల్వోసీ జారీచేసి పారిపోతుండగా సిసిఎస్ పోలీసులు పట్టుకున్నారు. బాధితుడు నరేందర్ కు బేవరేజ్ ఫ్యాక్టరీ పెట్టిస్తానంటూ కోటి 30 లక్షలు విడతల వారీగా వసూలు చేసి పరారైయాడు. తండ్రి వరప్రసాద్, మరో నిందితుడు విక్రమ్ కోసం స్పెషల్ టీం ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. ల్యాండ్ కొన్నానంటూ, సొంత ఫ్లాట్ అంటూ వ్యాపారులని నమ్మించి నట్టేట ముంచాడు. రామకృష్ణ పై ఆస్ట్రేలియాలో అనేక చీటింగ్ కేసులు, ఆస్ట్రేలియాలో జైలు జీవితం గడిపినట్లు సమాచారం. రామకృష్ణ చేతిలో ఎవరైనా మోసపోయి ఉంటే హైదరాబాద్ సిసిఎస్ పోలీసులని ఆశ్రయించండి అంటూ



ప్రకటించారు. రామకృష్ణ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి వ్యాపారవేతలను టార్గెట్ గా చేసి కోట్లాది రూపాయలు డబ్బులు వసూళ్లు చేస్తున్నాడు. సింగపూర్, మలేషియా, థాయిలాండ్, బెంగళూర్, ముంబై ప్రాంతాల్లో వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టించి అధిక లాభాలు వస్తాయంటూ నమ్మిస్తున్నాడు. బ్యాంక్ ఆఫ్ బరోడా నుండి 4 కోట్లు రూపాయలు లోన్ తీసుకొని ఎగ్గొట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## బాసరలో ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ఆత్మహత్య

**దశ, నిర్మల్:** బాసరలో ట్రిపుల్ ఐటీ విద్యార్థిని బుధవారం ఆత్మహత్య చేసుకుంది. సహచర విద్యార్థినులంతా క్లాసులకు వెళ్లిన సమయంలో హాస్టల్‌లోని ఒక రూమ్‌లో ఒంటరిగా ఉన్న ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని సహచర విద్యార్థినులు చూసి.. కళాశాల సిబ్బందికి సమాచారం అందించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వసంత ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని మృతిపై ఆమె తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం అందించారు. మృతురాలు.. ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతుందని పోలీసులు తెలిపారు.

# మాజీ మంత్రి మల్లారెడ్డికి షాక్...

**జీడిమెట్లలో ఉన్న వివాదాస్పద భూమికి సంబంధించిన సర్వే వ్యవహారంలో..**

దశ, హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలు.. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డిలకు సుప్రీంకోర్టులో షాక్ తగిలింది. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్లలో ఉన్న వివాదాస్పద భూమికి సంబంధించిన సర్వే వ్యవహారంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ఈ వ్యవహారంలో ఇప్పటికే తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను.. సవాల్ చేస్తూ మాజీ మంత్రి మల్లారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజరియాలతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టి.. తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది.ఇక ఆ వివాదంలో ఉన్న భూమి వ్యవహారంలో సర్వే ఇప్పటికే పూర్తి అయిన నేపథ్యంలో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చి చెప్పింది. జీడిమెట్లలోని సర్వే నెంబర్ 82లో ఉన్న 2.22 ఎకరాల భూమికి సంబంధించి.. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి ఇప్పటికే



ఇచ్చిన ఉత్తర్వులను తాజా విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సమర్థించింది.ఆ వివాదంలో ఉన్న భూమికి సంబంధించి.. కుత్బుల్లాపూర్ తహసీల్దార్ నోటీసులు ఇవ్వకుండానే సర్వే నిర్వహించారని ఎమ్మెల్యే మల్లారెడ్డి గతంలోనే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఆ సర్వేపై స్టే ఇవ్వాలని హైకోర్టును ఆయన కోరగా.. కోర్టు మాత్రం స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో హైకోర్టు నిర్ణయాన్ని

..మిగతా 2వ పేజీలో →



# ఇంటర్ పరీక్షలు ప్రారంభం

**దశ, హైద్రాబాద్ :** తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం 9 గంటలకు ఫస్టియర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. రేపట్నుంచి సెండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ పరీక్షల కోసం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 1495 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9.97 లక్షల మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఇంటర్ పరీక్షలకు హాల్ టికెట్ ఉంటేనే అనుమతిస్తున్నారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను పరీక్షకు అనుమతిస్తారు. హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా ఎంట్రీ ఉంటుంది. ఒక్క హాల్‌టికెట్ వెంట ఉంటే సరిపోతుంది. ఎలాంటి గుర్తింపు పత్రాలు అవసరంలేదు. తాజాగా సమాధాన పత్రాల మూల్యాంకనం షెడ్యూల్‌ను ఇంటర్‌బోర్డు ప్రకటించింది. మార్చి 4 నుంచి సంస్కృతం పేపర్ల మూల్యాంకనం ప్రారంభమవుతుంది. మార్చి 15నుంచి మొదటి విడత, మార్చి 18నుంచి రెండో విడత, మార్చి 20 నుంచి మూడో విడత మూల్యాంకనం ప్రారంభమవుతుంది. ఏప్రిల్ రెండో వారంలో ఫలితాలు విడుదల చేస్తారు.



# కోర్టుకు మరోసారి బెదిరింపులు

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో మరోసారి కోర్టులకు బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. తాజాగా తెలంగాణ హైకోర్టుతో పాటు నాంపల్లి సీబీఐ కోర్టును పేల్చివేస్తామని బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ కోర్టుకు, హైకోర్టుకు వరుసగా బాంబు బెదిరింపు ఈమెయిల్స్ వస్తున్నాయి. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ లతో పోలీసులు రంగంలోకి దిగి కోర్టు ప్రాంగణాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఇటీవల ఫిబ్రవరి 18, 2026 (బుధవారం) నాడు మొదటగా గుర్తుతెలియని వ్యక్తి నుంచి బాంబు బెదిరింపు మెయిల్ రాగా, మళ్ళీ ఫిబ్రవరి 20 (శుక్రవారం) నాడు రెండోసారి అదే తరహా బెదిరింపు రావడంతో లాయర్లు, సిబ్బంది, తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కోర్టు ప్రాంగణంలో ఆర్‌డీఎక్స్ (RDX) అమర్చినట్లు, అవి మధ్యాహ్నం సమయంలో పేలుతాయని ఇటీవల టైం కూడా ఆ మెయిల్స్‌లో మెన్షన్ చేశారు. బాంబు బెదిరింపు మెయిల్ సమాచారం అందుకున్న వెంటనే అబిడ్స్, నాంపల్లి పోలీసులు అప్రమత్తమై, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో కోర్టు అంతటా ముమ్మర తనిఖీలు చేపట్టారు. అయితే ఎక్కడా ఎటువంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఫేక్ బెదిరింపులు అని పోలీసులు పేర్కొన్నారు.

ఇటీవల కేవలం నాంపల్లి కోర్టుకే కాకుండా, కరీంనగర్ జిల్లా కోర్టుకు, నగరంలోని పలు ఆస్పత్రులకు సైతం బాంబు బెదిరింపులు రావడం తెలిసిందే. ఈ వరుస ఘటనల నేపథ్యంలో పోలీసులు కోర్టుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ మెయిల్స్ ఎక్కడి నుండి వచ్చాయి? వీటి వెనుక ఉన్నది ఎవరు.. తమకు అన్యాయం జరిగిందని ఇలా బెదిరింపులకు పాల్పడుతున్నారా.. లేక ఏదైనా కుట్ర కోణం ఉందా అని సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పదేపదే ఇలాంటి బెదిరింపులు ఎందుకు వస్తున్నాయో అర్థంకాక కోర్టు సిబ్బందితో పాటు, కేసు విచారణకు హాజరయ్యే వారు సైతం ఆందోళనకు గురవుతున్నారు.

# ఫోటో కొట్టండి.. గిఫ్ట్ పట్టండి

**మొదటి పేజీ తరువాయి**

తీసుకురానున్నట్లు హైదరాబాద్ వాటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి.. ఆ ఫోటోలో ఉన్న లొకేషన్‌ను గుర్తించి.. వెంటనే వారిపై జరిమానాలు విధిస్తామని వెల్లడించారు. ఒకవేళ వారు ఫైన్ చెల్లించకపోతే.. వారు వాటర్ ట్యాంకర్ బుక్ చేస్తే అందకుండా బ్లాక్ లిస్ట్‌లో పెడతామని అధికారులు తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు.ఇండిపెండెంట్ ఇళ్లు, అపార్ట్‌మెంట్, కాలనీలు.. ఇలా ఎక్కడైనా నగర పరిధిలో ఎవరైనా తాగునీటిని వృథా చేస్తూ.. వాహనాలు కడుగుతుంటే.. మొబైల్‌తో ఒక్క ఫోటో తీసి.. తమకు పంపించాలని హైదరాబాద్ వాటర్ బోర్డు అధికారులు నగరవాసులకు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పానీ యాప్‌ను.. మార్చి మొదటి వారంలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఆ ఫోటోను పానీ యాప్‌లో అప్‌లోడ్ చేసిన వారికి.. రూ.200 బహుమతిగా ఇస్తామని అధికారులు ప్రకటించారు. నీటిని వృథా చేసిన వారికి.. రూ.1000 నుంచి రూ.5000 వరకూ ఫైన్ విధిస్తామని వాటర్ బోర్డు అధికారులు హెచ్చరిస్తున్నారు.హైదరాబాద్ నగరంలోకి వందల కిలోమీటర్ల దూరం నుంచి.. జలాలను అధికారులు తీసుకువస్తున్నారు. అయితే ప్రతీ ఎండాకాలంలో ఒకవైపు నీరు లేక జనం అల్లాడిపోతుంటే.. మరికొందరు నగరవాసులు మాత్రం.. వాటిని భారీ ఎత్తున వృథా చేస్తున్నారు. ప్రభుత్వం ఒక కిలోలీటర్ నీటికి రూ.45 వరకు ఖర్చు చేస్తోంది. వాటిని ఇంటింటికీ నల్లా కనెక్షన్లకు నెలకు 20 కిలోలీటర్ల నీళ్లను ఫ్రీగా అందిస్తోంది. ఇక మరిన్ని అవసరాలకు రూ.10 చొప్పున ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నీటిని వృథా చేయవద్దని అధికారులు.. నగరవాసులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మాజీ మంత్రి మల్లారెడ్డికి షాక్...


**మొదటి పేజీ తరువాయి**

సవాల్ చేస్తూ.. మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డిలు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. అక్కడ కూడా హైకోర్టు తీర్పునే సమర్థించడంతో మళ్లీ ఎదురుదెబ్బ తప్పలేదు.అయితే శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి.. తన భూమిని మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డిలు కబ్జా చేశారంటూ ఆరోపించగా.. రెవెన్యూ అధికారులు గతేడాది డిసెంబర్ 9వ తేదీన అధికారికంగా భూ సర్వే చేపట్టారు. మేడ్చల్ జిల్లా సుచిత్ర సెంటర్‌లోని సర్వే నంబర్ 82, 83లో ఉన్న 1.29 ఎకరాల్లో.. 33 గుంటల భూమిని మల్లారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో కబ్జా చేశారని.. తమకు ప్రభుత్వమే న్యాయం చేయాలని శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. దీంతో పటిష్ఠ పోలీస్ బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు అధికారిక భూ సర్వే నిర్వహించారు. కానీ కోర్టులో తమకు అనుకూల తీర్పు వచ్చినా.. తమ భూమిని కాజేసే కుట్ర చేస్తున్నారని మల్లారెడ్డి అప్పుడు ఆరోపించారు. సర్వే సమయంలో అక్కడికి మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి అనుచరులు భారీగా చేరుకోవడంతో.. పోలీసులు వారిని అడ్డుకున్నారు.

# వైరాలో భారీగా డ్రగ్స్ పట్టివేత..



**దశ,ఖమ్మం:** వైరాలో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా అవుతున్న 101.2 కిలోల ఎండు గంజాయితో పాటు 2.7 కిలోల హాషీష్ ఆయిల్‌ను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ అనుమాస్పదంగా ఉన్న హర్యానా నెంబర్ ప్లేట్ కలిగిన కారును ఆపి చెక్ చేసింది. తనిఖీల్లో గంజాయి, హ్యాషిష్ ఆయిల్ బయటపడింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన మహమ్మద్ అస్లాంను పోలీసులు అరెస్ట్ చేశారు. కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వైరా ఎక్సైజ్ స్టేషన్‌కు నిందితుడిని అప్పగించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ సుమారు 67.20 లక్షల రూపాయలుగా తెలుస్తోంది.



ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి బుధవారం నియోజకవర్గం లోని పలు వివాహాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బంధువులతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. -(దశ, పెద్ద అంబర్ పెట్)

# అన్నయ్యా, లొంగిపో..

## మావోయిస్ట్ అగ్రనేత గణపతికి సోదరుడు రామచంద్ర రావు విజ్ఞప్తి

**దశ, హైదరాబాద్:** మార్చి 31వ తేదీ నాటికి మావోయిస్ట్ రహిత దేశంగా భారత్‌ను మార్చాలన్న ఆకాంక్షతో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆపరేషన్ కగార్ తుది దశకు చేరిన వేళ.. మావోయిస్టు పార్టీ టాప్ నేతలు అంతా ఒక్కొక్కరు వరుసగా పోలీసుల ముందు లొంగిపోతున్నారు. ఈ క్రమంలోనే మావోయిస్ట్ పార్టీ టాప్ లీడర్ ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి ఆచూకీపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే గణపతి సోదరుడు రామచంద్ర రావు మీడియా ద్వారా తన అన్న గణపతికి కీలక వినతి చేసుకున్నారు. తక్షణమే పోలీసుల ఎదుట లొంగిపోవాలని గణపతికి సూచించారు. గణపతి జనంలోకి రావడం కోసం తమ కుటుంబ సభ్యులతో పాటు తమ గ్రామం మొత్తం ఎదురుచూస్తోందని రామచంద్ర రావు పేర్కొన్నారు. గణపతితో కలిసి మావోయిస్ట్ పార్టీ ఉద్యమం కోసం పనిచేసిన చాలా మంది నేతలు ఇప్పటికే పోలీసుల ముందు లొంగిపోయారని గుర్తు చేశారు.



# యాంకర్ సుమ కనకాల, ఆర్టిస్ట్ బుల్లి రాజు సందడి

**దశ, రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల లోని గాంధీ చౌక్ లో 'వాసవి వస్త్రాలయం' ను ప్రసిద్ధ టెలివిజన్ యాంకర్ సుమ కనకాల మరియు ప్రముఖ నటుడు బుల్లి రాజు తోపాటు మాతేటి దుర్గం ప్రకాశ్, మాతేటి సునీత, మాతేటి సాయి కుమార్, మాతేటి ఉమా మహేశ్వరి (మేనేజింగ్ పార్ట్‌నర్లు) కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ దర్లా సందీప్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ.. నాణ్యమైన వస్త్రాలకు కొత్త చిరునామాగా 'వాసవి వస్త్రాలయం' నిలుస్తుంది అని గర్వంగా చెప్తున్నము "సిరిసిల్లలో వాసవి వస్త్రాలయాన్ని ప్రారంభించడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. రాజన్న సిరిసిల్ల ప్రజలకు హోల్‌సేల్ ధరల్లో నాణ్యమైన వస్త్రాలను అందించడం మా లక్ష్యం. ముఖ్యంగా పెళ్లిళ్లు మరియు శుభకార్యాల కోసం తాజా కలెక్షన్లు, ఆకర్షణీయమైన ఆఫర్లు, ప్రత్యేక బ్రైడల్ పట్టుచీరల శ్రేణిని నిరంతరం అందిస్తాము" అని తెలిపారు.

# దాతలూ.. దయచూపరూ..

## బ్లడ్ క్యాన్సర్‌తో చిన్నారి విలవిల

### ఆర్థిక లేమితో పేద కుటుంబం ఆవేదన.. ఆదుకోవాలని వేడుకోలు

**గంభీరావుపేట(సిరిసిల్ల):** బ్లడ్ క్యాన్సర్.. ఓ చిన్నారి జీవితాన్ని నిలువునా కుదిపేస్తోంది. గంభీరావుపేట మండలకేంద్రానికి చెందిన మహ్మద్ ఖాలీద్ కుమార్తె ఆలియా(11) ఏడాదిన్నర కాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఖాలీద్ స్థానిక వెల్డింగ్ దుకాణంలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. రెక్కాడితే గాని డొక్కాడని స్థితిలో లక్షలాది రూపాయలు అప్పులు చేసి వైద్యం అందిస్తున్నాడు. మందులు, రక్త పరీక్షలు, ఇంజెక్షన్లు, ప్రయాణ ఖర్చులు ఇలా కుటుంబాన్ని ఆర్థికంగా దివాళ తీస్తున్నాయి. చిన్నారి ప్రాణాలు కాపాడేందుకు దాతలు చేయూత నందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దాతలు చిన్నారి తండ్రి ఖలీద్‌ను 95501 68520 సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చు.




# కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

## అధ్యక్ష కార్యదర్శులుగా మెరుగు చంద్రమోహన్, ముత్యం ముఖేష్ గౌడ్

**దశ, కాప్రా:** కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ బుధవారం టిఎస్ఐఐసీ కాలనీలోని ప్రెస్ క్లబ్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సలహాదారులు వేంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షులుగా మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా దిలీప్ కుమార్, యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారిగా రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులుగా గంగి కృష్ణ, గోవిందు కుంట్ల ఆంజనేయులు, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, ముత్యం ముఖేష్ గౌడ్ కోశాధికారి రామచంద్రమూర్తి మాట్లాడుతూ కాప్రా ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమను కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో నూతన సభ్యులకు సభ్యత్వాలను అందజేయనున్నట్లు తెలిపారు.

# లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్స్

**దశ, ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి. ఉదయం ట్రేడింగ్ ఆరంభంలో మంచి లాభాలతో సానుకూలంగా కనిపించినప్పటికీ ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు రోజంతా ఒడిదొడుకులకు లోనయ్యాయి. చివరికి ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 50.15 పాయింట్ల స్వల్ప లాభంతో 82,276.07 వద్ద, నిఫ్టీ 57.85 పాయింట్ల లాభంతో 25,482.50 వద్ద స్థిరపడ్డాయి. మార్కెట్లలోని అస్థిరతకు అధిక స్థాయిల వద్ద మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ వంటి దిగ్గజ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై తీవ్ర భారం మోపింది. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్ వంటి ఐటీ షేర్లతో పాటు టాటా స్టీల్ వంటి మెటల్ కంపెనీల షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్లు నష్టాల్లోకి జారుకోకుండా నిలిచాయి. సెన్సెక్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు అత్యధికంగా 2.23




శాతం నష్టపోయింది. ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్ 2.8 శాతం లాభంతో టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా స్టీల్, టీసీఎస్, ఇండిగో, సన్ ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు కూడా లాభాలను నమోదు చేశాయి.ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మెరుగైన ప్రదర్శన కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.58 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.96 శాతం చొప్పున లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ ఇండెక్స్ అత్యధికంగా రాణించగా, నిఫ్టీ ఐటీ, ఫార్మా సూచీలు కూడా లాభాల్లో ముగిశాయి. అయితే, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ ఈ సెషన్‌లో అత్యధికంగా నష్టపోయింది.మార్కెట్ తీరుపై విశ్లేషకులు స్పందిస్తూ నిఫ్టీకి 25,400 స్థాయి వద్ద తక్షణ మద్దతు ఉందని తెలిపారు. ఒకవేళ సూచీ 25,300 స్థాయికి దిగువన స్థిరపడితే అమ్మకాల ఒత్తిడి మరింత పెరిగి 25,150 స్థాయి వరకు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేశారు. మార్కెట్ తిరిగి పుంజుకోవాలంటే, 25,650 వద్ద ఉన్న బలమైన నిరోధాన్ని అధిగమించాల్సి ఉంటుందని వివరించారు.